**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**ANDHRA PRADESH COMMITTEE**
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,** **విజయవాడ,**
గౌరవ ముఖ్యమంత్రి, **తేది : 22 జూలై, 2022.**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **- జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి**

**విషయం : ఒంగోలు డెయిరీని పునరుద్ధరించాలని, కార్మికుల బకాయిలను చెల్లించాలని కోరుతూ...**

**అయ్యా!**

ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నడిచిన ఒంగోలు సహకార డెయిరీ గత మూడు సంవత్సరాలుగా మూతపడి ఉంది. యాజమాన్యం నిర్వహణలో జరిగిన లోపాలు, అవినీతి ప్రధాన కారణాలు. అవినీతి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవడానికి బదులుగా దానిని శాశ్వతంగా మూసివేయడం జాతీయ సంపదను వృధా చేయడమే. ఒంగోలు పట్టణంలో 85 ఎకరాల స్థలంలో 600 కోట్ల విలువ కలిగిన అత్యంత ఆధునిక యంత్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఈ డెయిరీకి చెందిన వివిధ సెంటర్లలో పాలశీతల కేంద్రాలు, మరో 30 ఎకరాల విలువైన స్థలాలున్నాయి. అనుబంధంగా వందలాది గ్రామాల్లో ఉన్న సహకార సొసైటీలు పూర్తిగా మూలనపడ్డాయి. 2021 ఫిబ్రవరి 1న జిల్లా డైరీని అమూల్‌కి స్వాధీనం చేశారు. రైతులు భాగస్వామిగా ఉన్న ఈ సొసైటీలను మూలన పడేయడం, జిల్లా డెయిరీని మూత వేయడం 2019 వైఎస్సార్ కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలకు భిన్నం. నాడు మీ ఎన్నికల ప్రణాళికలో సహకార రంగాన్ని పటిష్టపరుస్తామని వాగ్దానం చేశారు. ఇప్పుడు గుజరాత్‌కు చెందిన అమూల్‌ని ప్రభుత్వమే బాధ్యత తీసుకొని నడుపుతున్నది. ఇందులో రైతుల భాగస్వామ్యం లేదు. రైతులకు అదనంగా వచ్చిన లాభమూ లేదు. గతంలో రోజుకి 2.3 లక్షల లీటర్లు సేకరించేది. 2020లో ఒంగోలు డెయిరీ మూతపడే నాటికి రోజుకి 30 వేల లీటర్ల పాలసేకరణ జరిగేది. ఆ నడక అలాగే కొనసాగి ఉంటే నేడు 50-60 వేల లీటర్లకు పెరిగి ఉండేది. 2020 సంవత్సరంలో వచ్చిన అమూల్ ప్రారంభంలో రోజుకి 20 వేల లీటర్లు సేకరించారు. ప్రస్తుతం అది 10 వేల లీటర్ల లోపు ఉన్నది. కొన్ని నెలలపాటు పాల ఉత్పత్తిదారులకు సరిగ్గా చెల్లింపులు కూడా జరగలేదు. 150 గ్రామాల నుండి మాత్రమే సేకరిస్తున్నారు. ఒంగోలు డెయిరీతో ఒప్పందం చేసుకున్నప్పటికీ దానిని అమలు చేయకుండా అద్దంకి సమీపంలోని ప్రయివేటు డెయిరీకి చెందిన చిల్లింగ్ సెంటర్‌తో ఒప్పందం చేసుకొని నెలకు లక్షన్నర చొప్పున చెల్లిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎంత ఒత్తిడి చేసినప్పటికీ రైతులు అమూల్‌కి పాలు పోయకుండా క్రమక్రమంగా తగ్గిస్తున్నారు. ఈ స్థానాన్ని సంగం డెయిరీతో సహా ఇతర ప్రయివేటు డెయిరీలు ఆక్రమిస్తున్నాయి.

కాబట్టి ఇప్పటికైనా అమూల్‌ని రైతులపై బలవంతంగా రుద్దడంకన్నా అత్యంత విలువైన సంపద కలిగిన ఒంగోలు డెయిరీకి ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చి నడిపితే ఇటు ప్రభుత్వానికీ భారం తగ్గుతుంది. అటు రైతులకీ మేలు జరుగుతుంది. కాబట్టి ఈ డెయిరీని తక్షణం పునరుద్ధరించాలని కోరుతున్నాను.

ఈ డెయిరీలో పనిచేస్తున్న 67 మంది ఉద్యోగులకు విఆర్ఎస్ ఇచ్చి పంపినప్పటికీ ఇంత వరకూ జీత భత్యాల బకాయిలూ చెల్లించలేదు. 2020లో అమూల్‌తో ఒప్పందం సందర్భంగా కార్మికులను కొనసాగిస్తామని చెప్పినా తర్వాత బలవంతంగా విఆర్ఎస్ ఇచ్చి పంపేశారు. ప్యాకేజీ కూడా అమలు చేయలేదు. దీర్ఘకాలం ఆందోళన తర్వాత ప్యాకేజీ ఇచ్చినప్పటికీ ఆ వచ్చిన డబ్బు అప్పటి వరకు కుటుంబాలు నడుపుకోడానికి అయిన అప్పులకే సరిపోయింది. నాటి చైర్మన్ ఒప్పందానికి విరుద్ధంగా సర్వీసు నుండి కూడా తొలగించారు. 35 సంవత్సరాలుగా కష్టపడి పనిచేసి డెయిరీని అభివృద్ధి చేసిన కార్మికులంతా వీధినపడ్డారు. వారికి తొమ్మిది నెలల జీత భత్యాలు, 28 నెలల ఈపిఎఫ్ బకాయిలు, ఎల్ఐసి బకాయిలు, 2014-15 నుండి పిఆర్‌సి డి.ఎ, ఇంక్రిమెంట్ల అరియర్స్‌లు, విఆర్ఎస్ తీసుకున్నవారి గ్రాట్యూటీ, 2010 నుండి రిటైర్‌అయినవారి గ్రాట్యూటీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తం దాదాపు రూ.16 కోట్లు వ్యయం చేస్తే చెల్లించవచ్చు. ఈ బకాయిల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం డెయిరీ రాష్ట్ర ఫెడరేషన్‌కు ఇచ్చినప్పటికీ వారు ఉద్యోగులకిచ్చే బకాయిలు చెల్లించకుండా బ్యాంకు బకాయిలు మాత్రమే చెల్లించారు.

అప్పుల్లో మునిగిపోతున్న కార్మికుల కుటుంబాలు మానసిక ఆందోళనకు గురౌతున్నాయి. వీరిని ఆదుకోవడం ప్రభుత్వ విధి. మీరు స్వయంగా చొరవ తీసుకొని వారి బకాయిలు చెల్లించేందుకు ఫెడరేషన్‌ను ఆదేశించగలరని కోరుతున్నాను.

అభివందనములతో...

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి